ప్రగతి పథంలో పల్లెలు!

పల్లెకు పురస్కారం.. ప్రగతికి ప్రోత్సాహం

- పాలేరు డివిజన్‌లో జాతీయ పంచాయతీ అవార్డుల పండగ
- జిల్లా ఉత్తమ పంచాయతీగా మోటాపురం
- లక్ష్యాల వేగవంతానికి పాలకవర్గం కృషి



రాజారాంపేట సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి(ఫైల్)



మంగాపురంతండాలోని పల్లె ప్రకృతి వనం

నేలకొండపల్లి: పల్లె సీమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకుని ప్రగతి దారిలో పయనిస్తున్న పంచాయతీలకు పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ జాతీయ పంచాయతీ పురస్కరాలను అందించి మరింత ప్రోత్సాహిస్తోంది. ఇందులో భాగంగా 2022 సంవత్సరానికి దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ వికాస్ పురస్కారాల ప్రదానం తాజాగా ప్రారంభమైంది. పంచాయతీల మధ్య స్నేహపూర్వక పోటీతత్వాన్ని పెంపొందించటంతో పాటు 2023 నాటికి స్థానిక సుస్థిర ప్రగతి లక్ష్యాలను వేగవంతం చేయటమే పోటీల ప్రధాన లక్ష్యం.



అమ్మగూడెంలో అంతర్గత సీసీ రహదారి

తొమ్మిది అంశాల్లో పోటీ..

జాతీయ పురస్కారం అందుకోవటానికి తొమ్మిది అంశాలను ప్రామాణికంగా నిర్ణయించారు. అవి 1.మెరుగైన జీవనోపాధి, 2.ఆరోగ్యకర పంచాయతీ, 3.బాలల స్నేహపూర్వకం, 4.నీటి సమృద్ధి, 5.పచ్చదనం పరిశుభ్రత, 6.స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, 7.సామాజిక భద్రతా పూర్వక, 8. సుపరిపాలన పంచాయతీ, 9. మహిళ స్నేహపూర్వక పంచాయతీ

ఈ పంచాయతీలు ఆదర్శం..

పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి 32, కూసుమంచి 41, ఖమ్మం రూరల్ 28, తిరుమలాయపాలెం మండలంలో 40 పంచాయతీలు మొత్తం కలిపి 141 పంచాయతీలు ఉన్నాయి. మండలానికి దాదాపు 15 నుంచి 18 పంచాయతీల వరకు పురస్కారాలకు ఎంపిక చేశారు. కానీ, ఆయా మండలాల అధికారులు సర్పంచ్‌లను నొప్పించకుడా ఉండాలనే ఉద్దేశంతో మండలంలోని అన్ని పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించి, షీల్డ్, ప్రశంసా పత్రాలను అందించారు. ఇదిలా ఉండగా.. జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా నేలకొండపల్లి మండలంలోని మోటాపురం గ్రామ పంచాయతీని ఎంపిక చేశారు. ఈ మేరకు ఈ నెల 25న ఖమ్మంలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ల సమక్షంలో సర్పంచ్ రాంబాయిని ఘనంగా సన్మానించారు.

గ్రామస్తుల సహకారం మరువలేనిది..



మండలంలో ఉత్తమ పంచాయతీ అవార్డు రావటం చాలా సంతోషంగా ఉంది. స్వయం సమృద్ధి మౌళిక సదుపాయాల విభాగంలో ఎంపిక చేశారు. గ్రామస్తుల సహకారం మరువలేనిది. పాలకవర్గం, సిబ్బంది, అధికారుల తమ వెంట ఉండి ముందుకు నడిపించారు. గ్రామస్తులకు రుణపడి ఉంటాం.

– భూక్యా సుధాకర్, సర్పంచ్, మంగాపురంతండా

అవార్డు బాధ్యతను మరింత పెంచింది..



మండల స్థాయిలో అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచింది. గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్తులు చెత్త, చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సిబ్బందికి సహకరిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలిచేందుకు కృషి చేస్తాం.

– గండు సతీష్, సర్పంచ్, అమ్మగూడెం

పురస్కారాలతో ప్రగతి పరుగులు..



ప్రభుత్వం పంచాయతీలకు పురస్కారాలు అందించటం వల్ల ప్రగతి పరుగులు పెట్టేందుకు దోహదపడుతుంది. రానున్న కాలంలో పాలకులు పోటీలు పడి అభివృద్ధి పనులు చేస్తారు. భవిష్యత్‌లో పాలేరు డివిజన్ నుంచి రాష్ట్ర స్థాయి అవార్డులు పొందే విధంగా పని చేయాలి.

– నెల్లూరి లీలాప్రసాద్, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్, నేలకొండపల్లి

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో నిర్వహించే గ్రీవెన్స్‌కు వచ్చే ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరవాసుల నుంచి గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు అందుకున్న అనంతరం అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నందున అధికారులు, సిబ్బంది వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు పదేపదే కార్యాలయం చుట్టూ తిరగకుండా వారి సమస్యలను సకాలంలో పరిష్కరంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, డీఈలు నవ్యజ్యోతి, రంగారావు, డీసీపీ వికాశ్, ఆర్‌ఐలు లోకేష్, శ్రీనివాస్, ఏఎస్‌ఓ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌ను కచ్చితంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరాజు

నేలకొండపల్లి: స్వచ్ఛ భారత్ మిషన్‌ను కచ్చితంగా అమలు చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ వెంకటరాజు ఆదేశించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో స్వచ్ఛ భారత్ మిషన్‌పై అవగాహన కల్గించేందకు మూడు రోజుల పాటు నిర్వహించే సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్లకు రెండు గుంతలు తీసి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ అనూప్, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఈసీ శేషగిరిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, గ్రామ దీపికలు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి సంబంధించిన వారు ఎంతటి వారైన ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని, నష్టపోయిన ప్రతి విద్యార్థికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు మలిదశ ఉద్యమంలో విద్యార్థులు, నిరుద్యోగుల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ సాధించుకున్న ఎనిమిదేళ్ల తర్వాత కూడా పేపర్ లీకేజీతో నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కృష్ణమాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్‌గుండు హరికిషోర్ గౌడ్, పి.వెంకటేశ్వరావు, రామకృష్ణ, సాయిశేషు, నాగేశ్వరావు గౌడ్, మాధవరావు, సత్యం, వంశీకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా శ్రీ రామనవమి ఏర్పాట్లు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం గాంధీచౌక్ సెంటర్‌లో శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక్కడ శ్రీ సీతారామచంద్రస్వామి 76వ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కిరాణ జాగిరీ మర్చంట్స్ అసోసియేషన్ బాధ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భద్రాచలం తరహాలోనే ఇక్కడ కూడా శ్రీ రామనవమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాగా, 29వ తేదీ నదీ జలాల ఊరేగింపు, స్వామికి అభిషేకం, ఎదుర్కోలు, 30వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు తిరు కల్యాణోత్సవం, మహా అన్నదానం, 31న పుష్కర మహాసామ్రాజ్య పట్టాభిషేకం, కనకాభిషేకం ఉంటాయని నిర్వహణ కమిటీ బాధ్యులు వేములపల్లి వెంకటేశ్వరరావు, వజ్రపు మోహన్, కురువెళ్ల జగన్ మోహన్‌రావు వెల్లడించారు. ఈమేరకు గాంధీచౌక్ శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి మహిళా డిగ్రీ కళాశాల వైపునకు చలువపందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు.

కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదు..

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని తెలంగాణ ఉద్యమకారులు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ఉద్యమకారులు నాయకులు ఉప్పల వెంకటరమణ మాట్లాడుతూ.. వేల కోట్ల కాంట్రాక్టులు చేస్తూ, చిన్న కాంట్రాక్టర్లను ఎదగనీయకుండా బెదిరిస్తున్న కొందరు నేతలు ఇప్పుడు బీఆర్‌ఎస్, కేసీఆర్‌పై విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో దోకుపర్తి సుబ్బారావు, లింగనబోయిన సతీష్, పగడాల నరేందర్, మండదపు శంకర్‌రావు, మంచికంటి నరేష్, నందిగామ రాజ్‌కుమార్, కోడిరెక్క ఉమాశంకర్, చల్లపల్లి అజయ్‌చారి, ఎం.డీ.ఆసిఫ్, బురాన్, ఈదుల రాజేష్, అలవాల నాగేశ్వరరావు, నెమలికొండ వంశీ పాల్గొన్నారు.

రేషన్‌తో పాటు నిత్యావసరాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

ఖమ్మంరూరల్: రేషన్ దుకాణాల్లో 10 కేజీల ఉచిత బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులు ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ. రాజేష్ కేంద్ర, రాష్ట్ర పాలకులను డిమాండ్‌చేశారు. సోమవారం మండలంలోని ఎంవెంకటాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్లు దోచిపెడుతున్న పాలకులు.. పేదలకు అవసరమైన సరుకులు అందించడంలో ఎందుకు శ్రద్ధ వహించడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 17వేల రేషన్‌షాపుల ద్వారా కేంద్ర ప్రభుత్వం 5 కేజీల బియ్యం మాత్రమే ఇస్తోందని వాటికి రాష్ట్ర ప్రభుత్వం 5 కేజీలు కలిపి 10 కేజీలు అందించాలని తెలిపారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి, సబ్సిడీ కూడా ఎత్తి వేస్తున్నారని, ఇది కార్పొరేట్లకు మేలు చేసేందుకేనని విమర్శించారు. ఈ డిమాండ్లను తక్షణమే పాలకులు అమలు చేయాలని లేనిఎడల పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఝాన్సీ, వసుమతి, మమత, టి. సరోజిని, ఎం. వెంకటేశ్వర్లు, పీవైఎల్ నాయకులు మోహన్‌రెడ్డి, సంపత్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: శ్రీచైతన్య టెక్నో స్కూల్ జోనల్ స్థాయిలో నిర్వహించిన అబాకస్, నారేషన్ తదితర పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. సోమవారం ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని శ్రీచైతన్య టెక్నోస్కూల్‌లో విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డీజీఎం చేతన్, ఆర్‌ఐ జయప్రకాష్, ప్రిన్సిపాల్ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పోరాటం



జుజుల్‌రావుపేటలో మాట్లాడుతున్న అశోక్

కూసుమంచి: ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలు అయ్యేంత వరకూ పోరాటం ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఇన్నేపల్లి అశోక్ అన్నారు. వర్గీకరణకై చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర సోమవారం మండలంలోని జుజుల్‌రావుపేట, పాలేరు, కూసుమంచి, కిష్టాపురం, నర్సింహులగూడెం గ్రామల్లో కొనసాగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ వర్గీకరణ చేపడతామని మోసపూరిత మాటలు చెపుతుందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే బీజేపీ నాయకులను ఎస్సీ కాలనీల్లో తిరగనీయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్, శ్రీకాంత్, రాజేష్, శ్రీను, క్రాంతి, హన్మంతరావు, ఎమ్మెస్పీ పాలేరు ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు మాదిగ, పగిడికత్తుల ఈదయ్య, కె.రోషయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపవాసం.. ఒక నిశబ్ద ఆరాధన

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపవాసం అంటే కేవలం అన్న, పానీయాలు వదిలేయటం కాదని చెడు మార్గాన్ని మానేసి, మంచి పనులను అవలంబించాలనే ఉద్దేశంతో చేపడతారని జమాతె ఇస్లామి హింద్ ఖిల్లా అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ అలవర్చుకోవటానికి రంజాన్ ఉపవాసాలతో విశ్వాసికి సహనగుణం అలవడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మోహినుద్దీన్, ఇలియాస్ , అబ్దుల్ మల్లిక్, ఆబిద్, ఇంతియాజ్, నెహాల్ అహ్మద్, రజాక్, ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బియ్యం,నిత్యావసరాలు అందిస్తున్న దాతలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 32వ డివిజన్‌కు చెందిన కేఎంసీ అవుట్ సోర్సింగ్ కార్మికుడు దేశపాక ఉపేందర్ ఇంటిలో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటిలోని సామన్లన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, కార్పొరేటర్లు దోన్‌వాన్ సరస్వతి, రామ్మోహన్, నాయకులు కోన్‌వాన్ రవి, కన్నం ప్రసన్నకృష్ణ, మక్కల రాజేష్‌లు ఉపేందర్ ఇంటికి వెళ్లి జరిగిన ఘటన గురించి తెలుసుకొని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ సరస్వతి రూ.10 వేలు, ఆర్జేసీ కృష్ణ బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు రూ.5 వేలు, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు మరో రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి గృహలక్ష్మి పథకం కింద నిధులు ఇప్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాటేటి కిరణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని సాయిగణేష్‌నగర్‌కు చెందిన డిగ్రీ చదివిన ఓ యువతి సోమవారం అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించిన ఆ యువతి సోమవారం తెల్లవారుజామున ఆమె తండ్రి చూసే సరికి కనిపించలేదు. దీంతో తెలిసిన వారి, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ



రాయగూడెంలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాయల

నేలకొండపల్లి: దేశంలో ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోదీ ఖూనీ చేస్తున్నారని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆరోపించారు. సోమవారం మండలంలోని రాయగూడెంలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు హాజరైన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు అనైతికమని, ప్రజాస్వామ్య దేశంలో చీకటి రోజులు వచ్చాయని పేర్కొన్నారు.అనర్హత వేటు భావ ప్రకటన స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు అన్నారు. రాహుల్‌గాంధీ అంటే భయంతోనే ఇలాంటి దుర్మార్గానికి పాల్పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీని ఇంటికి పంపటం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, యాతాకుల శ్రీనాథ్, యడవల్లి నాగరాజు, చీనా నాయక్, సూరేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

నేలకొండపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి సోమవారం మేజర్ పంచాయతీ సర్పంచ్ రాయపూడి నవీన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

రఘునాథపాలెం: భగవద్గీత పుస్తకాలను సోమవారం మండలంలోని వీవీపాలెంలో గ్రామ సర్పంచ్ రావేళ్లమాధవికి కేఎల్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించినట్లు ఫౌండేషన్ చైర్మన్ బానోత్ కీమా తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా పెద్ద మొత్తంలో ఈ పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం



తిరుమలాయపాలెం: మేడిదపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మంగీలాల్

నేలకొండపల్లి/రఘునాథపాలెం/కూసుమంచి/తిరుమలాయపాలెం: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లిలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, రఘునాథపాలెం మండలంలోని దొనబండ పంచాయతీలో జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, కూసుమంచి మండలంలోని బోడియా తండా పంచాయతీలో ఎంపీపీ బోనోత్ శ్రీనివాస్‌నాయక్, తిరుమలాయపాలెం మండలంలోని మేడిదపల్లిలో ఎంపీపీ మంగాలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్‌లు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, సర్పంచ్ కొండ్రు విజయలక్ష్మి, వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, మణి పాల్గొనగా.. రఘునాథపాలెం కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, దొనబండ సర్పంచ్ రాజేష్ పాల్గొన్నారు. అదేవిధంగా కూసుమంచి కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా రాణి, గ్రామ కార్యదర్శి రమేష్, వైద్యాధికారి రాజేందర్, సూపర్‌వైజర్ విద్యాభారతి పాల్గొనగా.. తిరుమలాయపాలెం కార్యక్రమంలో సర్పంచ్ బండ్ల విజయసురేష్, ఎంపీటీసీ ఎర్ర పుష్పలత, డాక్టర్ రామారావు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ్ పక్వాడ ప్రదర్శనలు

పలు మండలాల్లో సోమవారం చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించేందుకు పోషణ్ పక్షోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: అంగన్‌వాడీలో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ బాలా త్రిపుర సుందరి

క్లుప్తంగా

నియామకం



నియామక పత్రం అందిస్తున్న సుధీర్‌బాబు

కూసుమంచి: వైఎస్సార్‌టీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని లోక్యాతండాకు చెందిన జర్పుల కోటేష్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్ బాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాసంగులపాటి రాఘవ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా తనకు పదవీ బాధ్యతలు అప్పగించిప వారికి కోటేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

కృష్ణయ్యకు టెక్నికల్ అసిస్టెంట్‌గా పోస్టింగ్

ఖమ్మం సహకారనగర్: సస్పెన్షన్‌లో ఉన్న డీఆర్‌డీఏ ఉద్యోగి ఓరుగంటి కృష్ణయ్యకు హైకోర్టు ఆదేశాల మేరకు టెక్నికల్ అసిస్టెంట్‌గా కూసుమంచిలో పోస్టింగ్ ఇచ్చారు. 2014లో సస్పెండ్ ఆయన హైకోర్టును ఆశ్రయించగా, ఉద్యోగంలో కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన కలెక్టర్ గౌతమ్‌ను సోమవారం గ్రీవెన్స్ డేలో కలవగా, నియామక ఉత్తర్వులు అందజేశారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: అసంఘటిత రంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించి, వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శ్రీను డిమాండ్ చేశారు. హమాలీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు తుశాకుల లింగయ్య అధ్యక్షతన ఖమ్మంలోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు నిధులు కేటాయించాలని, నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మోహన్‌రావు, దొంగల తిరుపతిరావు, ఎర్ర మల్లికార్జున్, పీరయ్య, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్, రిటైర్డ్ తహసీల్దార్ ఆర్.రవీందర్‌రావు ఆధ్వర్యాన తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరెడ్డిని ఘనంగా సత్కరించారు. సోమవారం పెన్షనర్స్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు.తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, సుబ్బయ్య, మారంరాజు రాధా కృష్ణారావు, హనుమంతరావు, పి.జనార్దన్‌రావు, డీకే శర్మ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైరాలో జరిగిన హాథ్ సే హాథ్ కార్యక్రమంలో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముస్తాఫాను ఆదివారం రాత్రి మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	జాన్ విక్: చాప్టర్ 4
ఆదిత్య	కబ్జా
శ్రీనివాస	దాస్ కా దమ్కి
సుందర్	రంగ మార్తాండ

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	42		20
కాకర	40	చుక్కకూర	2
బోడ కాకర	60		10
బీర	50	తోటకూర	2
దొండ	38		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	24		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	